# శిక్షాకాలం

## ఎమ్.డి. సౌజన్య

"సూర్యం అంటే .... నువ్వేగా .... బాబూ !" అనే మాటలకు, అంతవరకు యింకా బద్ధకంగా, అదమరిచి, వియం తలా - నిర్భయంగా నిద్రపోతున్న సూర్యం -

'ఇక్కడ నన్ను శాసించేదెవరు ?' అన్నట్టు బద్ధకంగా కళ్ళు తెరిచి తన కళ్ళముందు నిలుచున్న ఆకృతి ఎవరిదో ముందు గుర్తురాక, తరువాత అర్థమై పులిని అదాటున చూచిన లేగదూడలా, భయంకరమైన పీడకలలో మెళకువ వచ్చిన పసివాడిలా, పక్కనే పిడుగు పడట్టు లేచికూర్చున్నాడు !

ఎదురుగా .... చింపిరి తలతో, దుబ్బుల్లావుండే కనుబొమలతో, నిప్పు కణికల్లా, ఎఱ్ఱగా జీరలు పొంగే కళ్ళతో, కోరమీసాలతో పోటీపడుతున్నట్లుండే చివరి గడ్డంతో, నగిషీ చెక్కే నల్ల రాయిలా వుండే రూపంతో, కండలు తిరిగి, అణువణువునా కష్టజీవి, భూమా తను నమ్ముకున్న యీ మనిషి .... అతనే .... అతనే సందేహం లేదు .... అనుకున్నాడు; కాని .... ఇతను .... కండెమ్డ్ సెల్ (ఉరిశిక్షపడ్డ ఖైదీలుండే వార్డు) లో వుండవలసిన వ్యక్తిగదా !? మరి .... నా జైలు గదిలోకి .... ఇంత పుదయమే ఎలా వచ్చాడు ? .... ఎందు కొచ్చాడు !? .... అర్థంకాలేదు.

ఇతనికి సేషన్సు కోర్టు వేసిన ఉరి శిక్ష - హైకోర్టు, సుప్రీంకోర్టు, ధృవ పరిచాయి। క్షమాభిక్ష వేడుతూ రాష్ట్రపతికి పెట్టుకున్న మెర్సీ పిటీషను తిరస్కరింపబడినది.


ధృవపడిన ఇతని మరణవార్తను సూర్యం ప్రక్కనుండగానే డిప్యూటీ జైలరు, జైలు సూపర్నెంట్ సమక్షంలో చదివి వినిపించాడు.

"ఇంకో వారంలో నీ ఉరిశిక్ష అమలు జరుపబోతున్నాం । ఈ వారం రోజులు నీకేమేమి తినాలని వున్నా, ఎవరెవరిని చూడాలని వున్నా .... ఏం చేయాలని

---

**1979 చక్రపాణి ప్రథమ అవార్డు పొందిన కథ**

---


CHANDRA

వున్నా, నిర్భయంగా చెప్పు....తీరుస్తాం," అన్నాడు.

తన మరణవార్త విని ఆ ఖైదీ .... ఏడ్వలేదు, పిచ్చిగా అరవలేదు. ఆ చదివి వినిపించిన వ్యక్తిని తిట్టలేదు. కలబడి కొట్టలేదు-నిర్లిప్తంగా నవ్వాడు;

జైలు డాక్టరు, మరునాడు సూర్యం సాయం చేస్తూండగానే ఆ ఖైదీ మెద కొలతలు తీసుకున్నాడు, తూకంవేశాడు। మరణవార్త విన్న ఆ ఖైదీ శారీరక మానసిక స్థితిలో ఏ విధమైన వడుదుడుకులు కలగలేదని పరీక్షించి వ్రాసుకుపోయాడు.

సూర్యానికి....మనిషి చేసిన చట్టం ఒక ప్రక్క మనిషిని చంపుతూనే .... మళ్ళీ ఆ చంపబడే మనిషి సక్రమమైన ఆరోగ్య స్థితిలో చంపబడుతున్నాడో లేదో జాగ్రత్తపడుతూంది। శ్రద్ధతో పరీక్షిస్తోంది।

ఈ ద్వంద్వ ప్రవృత్తి ఏమిటో, ఎందుకో, అర్థం కావటంలేదు।

నేరస్తుణ్ణి సంస్కరించవలసింది పోయి, అతను చేసిన హత్యను తనూ చేస్తుంది। ఇది ఇతరులకు గుణపాఠంగా వుండాలంటోంది। ఇదే న్యాయమంటోంది, ఇదే చట్టమంటోంది। వింత భిన్నత్వం।।

మరి .... అలా ఉరికంబం ఎక్కబోతున్న ఖైదీ, కండెమ్డ్ సెల్ నుంచి తన గదిలోకి ఎందుకొచ్చాడో సూర్యానికి అర్థంకాలేదు। భయంతో ....సూర్యానికి వళ్ళంతా చెమటపడుతోంది।

అతని గుండె కొట్టుకోవటం స్పష్టంగా వినబడుతోంది।

చెవుల్లోంచి వెచ్చని ఆవిరి .... కళ్ళు మసక మసకగా .... అంతా అలికివేసినట్టు .... అస్పష్టంగా .... ।।

"సూర్యంబాబు నువ్వేగా బాబూ।" మళ్ళీ అడిగాడు ఆ గడ్డపు మనిషి, కాళ్ళకు చేతులకు వేసుకున్న గొలుసులు గలగలలాడుతుండగా

ధర్మాన్ని బలవంతాన బంధించినట్టు। నియమానికి కట్టుబడివున్న భీముడు అవమానాన్ని నిండుసభలో సహిస్తూ ఉన్నట్టు నిలబడివున్న ఆ వ్యక్తిని సూటిగా చూడలేకపోతున్నాడు సూర్యం।

అప్పుడే సూర్యానికి క్రితం రాత్రి జరిగిన సంఘటన గుర్తొచ్చింది।

ఈ ముసలాడే ఒక జైలర్ని పులి మేక మెడ పట్టినట్టు, గ్రద్ద కోడిపిల్ల గొంతు వడిసిపట్టినట్టు వడసిపట్టి, తన కబంధ హస్తాలతో ఎందరు విశ్వ ప్రయత్నం చేసినా విడిచిపెట్టకుండా పళ్ళు పటపట కొరుకుతూ, రౌద్రమూర్తయిపోతూ "నాయాల...నేను .... సదువురానోణ్ణని ఎవడో రాసిన ఉత్తరం....మా శివాయ్ రాశాడని సెప్పి నా వంతు అన్నం, టీ, పబ్బుముక్క కాజేస్తావా।? అడిగితే.... అయన్నీ నీ మొహాన ముష్టోడికి ఏసినట్టు

ఇసరేసేవోణ్ణే! మా శివాయ్ ఏంచేసాడ్రా నిన్ను! ఎవడో ఎవడికో రాసిన ఉత్తరం మా శివాయ్‌గాడు రాశాడని బొంకావ్," అంటూ ఉగ్రనరశింహావతారం దాల్చాడు.

అప్పుడే జైలు సూపర్నెంట్‌గారి ఇంటికి - జైల్లోని వంటసామాను యిచ్చి వచ్చే ప్యూనుకు తట్ట సర్ది ఎత్తుతున్న సూర్యం ఆ ముసలాడి కోపాన్ని చూసి భయపడిపోయాడు.

మరో హత్య జైల్లో - అందులో - ఉరిశిక్షపడ్డ ఖైదీ చేతుల్లో జైలర్ చావు !?.... జరిగిపోతోంది అనుకుం టుండగానే....

అప్పటికే గొంతుపెగలక, గండుపిల్లి నోటికి చిక్కిన పెంపుడు పావురంలా గిలగిల తన్నుకుంటూ, దిక్కులు పిక్కటిల్లేలా జైలర్ వేసిన కేకకు, జైలు గార్డులు బిలబిలమంటూ పరుగెత్తు కొచ్చారు!

వాళ్ళ చేతుల్లో లాఠీలు, తుపాకీ మడమలు ఆ ముసలివాడి తలమీద, వంటిమీద పిడుగుల్లా పడ్డాయ్! ఆ దెబ్బల ధాటికి తాళలేక ఆ వృద్ధుడు మొదలు నరకబడ్డ వృక్షంలా నేల కొరిగాడు!

'ఆ వ్యక్తే.... ఆ ఖైదే.... ఇతను... నా జైలు గదిలోకి ఎందుకొచ్చాడు!'?

ఎంత తల బద్దలుకొట్టుకున్నా సూర్యానికి ఆ ప్రశ్నకు సమాధానం దొరకలేదు!

"సూర్యం బాబూ! ఈడ జైల్లో పెద్ద సదువు సదివినోడివి నువ్వేనంట రెండు ముక్కలు సదువు సెప్పు బాబూ! నీకు పుణ్యముంటుంది!" అన్నాడు ఆ ముసలి వాడు.

సూర్యానికి ఆమాట లెంతో ఆశ్చ ర్యాన్ని గొలిపాయి! అతను పరాచికాని కలా అడుగుతాడని ఎలా అనుకుంటాడు,

ఇది విజమేనా !?

నమ్మలేక ఆ ముసలివాడి వైపు చూశాడు!

జైలుగది బయట ఇద్దరు సెంట్రీలు నిలబడి వున్నారు! వాళ్ళతో వచ్చుం టాడు. సూర్యం అర్థంకాక తికమక పడుతున్న ప్రశ్నకు సమాధానం అన్నట్టు, "ఔను బాబూ.....నీకాడ రెండు ముక్కలు నేర్చుకుందామనే వచ్చాను! రేపో మాపో పోయేవాణ్ణే! అయినా నీ చివరి కోరిక ఏదంటే....రెండు ముక్కలు నీకాడ సదువుకుంటానని జైలు అధికార్లకు సెప్పుకున్నా! రెండుముక్కలు సెప్పవా బాబూ ?" అన్నాడు దీనంగా.

వెంటనే సూర్యానికి తను సెంట్రల్ జైల్లో చూడటానికి మొదటిసారి ముషీరా బాద్ వచ్చిన తండ్రితో తను కటువుగా అన్న మాటలు గుర్తొచ్చాయి.

సూర్యానికి తనని అసలు జైలుకు రావటానికి, తన కన్నతండ్రే కారణమని కడుపుమంట!

ఆ రోజు....సరిగా పది నెలల క్రితం ....నిరుద్యోగిగా....

"ఏ వుద్యోగం రాకపోతే.... అడక్కు తినటానికైనా సిద్ధమే కాని, నువ్వు వెలగ బెట్టి రికైరైన బడిపంతులు ఉద్యోగం ఈ జన్మకు చేయను। ఐ హేట్ యువర్ ప్రొఫెషన్.... వెరీమచ్। ఐ.... హే.... ట్.... ట్।" అన్నాడు సూర్యం తండ్రితో కటువుగా.

కొడుకు మాటలకు సుబ్బరామయ్య కలతపడలేదు। భూదేవిలా ఓర్పుతో చిరునవ్వు నవ్వాడు।

"అమాయకుడా .... నీకు కాస్తన్నా లోకజ్ఞానం లేదేమిట్రా....ఎలా బ్రతుకు తావురా యీ లోకంలో।" అన్నట్లు వుంటుంది ఆ నవ్వు ప్రతిసారీ.

అందుకే సూర్యానికి ఆ నవ్వంటే మంట।

ఆ నవ్వు వెనక తన చేతకాని తన మంతా తండ్రి దాచుకుంటాడని అతనికి నమ్మకం.

మెడిసిన్‌లో మెరిట్‌తో సీటువచ్చిన రోజున, "ఒరే అబ్బాయ్।" ఆ ఖరీదైన చదువులు డబ్బున్న మారాజులకి। పూటకు ఠికాణాలేని మనకు కాదు। పాతిక రూపాయలు పెట్టి విశాఖపట్టణం టికెట్టు కొనటానికి ముప్పైత్తే మనకు ఏ స్కాలర్ షిప్ వచ్చినా అరేళ్ళు గడిచేదెట్టా। నా మాట విని వెళ్ళి ఏ టైపో-షార్టుహాండో నేర్చుకో।" అన్నాడు, నవ్వుతూ సుబ్బరామయ్య.

అయినా సూర్యం మొండికెత్తి వారపు భోజనాలు, చందాలు ఏర్పాట్లు చేసుకొని, నానా గడ్డిగరచి చివరికి బి.ఎస్‌సి.లో చేరి థియరీ వరకు పూర్తి చేశాడు.

కాని, ప్రాక్టికల్స్‌కొచ్చిన ఎగ్జామినరు డబ్బులాగి మార్కులు వేస్తూండటంతో ఎలాగైనా ఓ రెండొందలు నర్దమని తండ్రిని కోరాడు।

"రిటైరైనా .... నాలుగు ట్యూషన్లు చెప్పంది....పూట గడవని మన ఆర్థిక స్తోమత నీకు తెలియందా బాబూ।" అన్నాడు నవ్వుతూ.

ఫలితంగా సూర్యానికి ఫస్ట్ క్లాస్ కొద్దిలో పోయింది.

డబ్బుతో మార్కులు సంపాదించిన వాళ్ళు ఫస్ట్ క్లాసులు డిస్టింగ్‌షన్‌లు పొందారు।

ఇక ఉద్యోగాన్వేషణలో - తప్పి తప్పి కంపార్ట్‌మెంట్స్‌లో పాసయిన వాళ్ళు, థర్డ్‌క్లాసులవాళ్ళు అడ్డదారుల్లో వచ్చి అందల మెక్కుతుంటే, ఉత్తర దక్షిణాలు లేనికారణంగా సూర్యానికి కనీసం ఒకటి రెండు యింటర్‌వ్యూలూ రాలేదు।

బి.యస్‌సి. డిగ్రీ చేతిలో వున్నా మెట్రిక్ కనీస అర్హతల ప్యూను, అటెండరు ఉద్యోగమూ రాలేదు.

ఫలితంగా అతనిలో క్రమేపీ -

నిస్పృహ, కసి, ద్వేషం, ఈర్ష్య ప్రవేశించాయి.

చదువుకోకుండా హాయిగా ఏ పొలం పనో, కూలినాలో చేసుకున్నా తను చీకూచింతా లేకుండా కనీసం తన పొట్ట వరకన్నా తను సంపాదించుకునేవాడు!

కానీ - ఇస్త్రీ బట్టలు, ఇన్‌షర్టు, బూట్లు - అతనికి తను తెల్లకాలరు మాయకుండా కుర్చీలో కూర్చునే ఉద్యోగానికి తప్ప మరోదానికి పనికిరానని పించేట్టు చేశాయి.

అతనికి చివరికి చదువన్నా, తన తండ్రిలా చదువు చెప్పేవాళ్ళన్నా, చదువు చెప్పే సంస్థలన్నా కోపం, ద్వేషం, అసహ్యం ఏర్పడిపోయింది.

అతను ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు.

తరువాత నెలకు సూర్యాని కేదో వుద్యోగం వచ్చినట్లు ఉత్తరం చూసి సుబ్బరామయ్య నమ్మలేకపోయాడు.

కానీ మళ్ళీ వారానికే – మార్కులు దిద్ది ఫస్టుక్లాస్ వచ్చినట్టు పాస్‌సర్టిఫికేట్ మీద సంతకం ఫోర్జరీ చేసినందుకు అరెస్ట్‌చేసినట్టు పోలీస్ రిపోర్ట్ వచ్చినప్పుడు నమ్మాడు.

సూర్యం భవిష్యత్తు నాశనం కాకూడదని, అతను జైలుపాలు కాకూడదని, వున్న వొంటినిట్టాడి పూరిల్లూ అమ్మి, ప్లీడరును పెట్టి, విశ్వప్రయత్నం చేశాడు సుబ్బరామయ్య.

అయినా సూర్యానికి రెండేళ్ళు జైలు శిక్ష పడింది.

"అదీ ప్రథమ నేరమని, ముద్దాయి యువకుడనీ కొంత మానవతా దృక్పథంతో చూడబట్టి," అన్నాడు లాయరు.

ముషీరాబాద్ సెంట్రల్ జైల్లో వున్న సూర్యాన్ని చూడవచ్చిన తండ్రి, "బాబూ సూర్యం! జరిగిందేదో జరిగిపోయింది. ఇకనైనా....నీ కొచ్చిన ఆ రెండు ముక్కలు తోటి ఖైదీలకు చెప్పి పుణ్యం కట్టుకో!" అన్నాడు.

తండ్రి హితవు వింటూనే ప్రేటు తిన్న త్రాచులా లేచాడు సూర్యం.

అతని ముఖం కోపంతో జేవురించింది.

కళ్ళు చింతనిప్పుల్లా ఎర్రబడ్డాయి.

"నన్ను ఇక్కడా చదువు చెప్పమంటున్నావా? చదువుకున్నందుకే నేను ఈరోజు ఈ స్థితిలో వున్నానన్న సంగతి మరచిపోయావా!? జైల్లో పడ్డదానికంటే ఏ చదువు నన్నీస్థితికి తెచ్చిందో ఆ చదువు ఇక్కడివాళ్ళకూ చెప్పమనటం నాకు బాధగా ఉంది. మళ్ళీ జన్మంటూ ఉంటే, ఈ చదువు చదువుకునే పరిస్థితి, చెప్పే స్థితి కల్పించవద్దని కోటి దేవుళ్ళను కోరుకుంటాను!" అన్నాడు వుద్వేగంగా.

అధ్యాపక వృత్తిమీద సూర్యానికి ఏర్పడిన అపోహ ఆ వృత్తి ఔన్నత్యం సరిగా అవగాహన కాకపోవటంవలననే

నని అర్థంచేసుకున్న సుబ్బరామయ్య బాధగా అక్కడినుంచి నిష్క్రమించాడు.

ఇన్నాళ్ళకు ....ఇప్పుడు....ఉరికంబం ఎక్కబోయే ఒక ఖైదీ....తనను అధ్యాపకుడిగా మారి .... రెండు ముక్కలు నేర్పమంటున్నాడు !?

"సూర్యం బాబూ! రేపో మాపో పచ్చేవోడికి, అడిగితే రెండు ముక్కలు సదువు సెబుతావనే ధైర్యంతో....జైలు అధికారులందరికీ....జైల్లో నేను తోట పనిచేసిన డబ్బులన్నీ లంచం కట్టా! ఇదిగో బొగ్గుముక్క.....ఈడ నాపరాయి మీద రెండు ముక్కలు దిద్దబెట్టవూ!?" అన్నాడు, కింద కూర్చుంటూ.

కాని సూర్యం వెంటనే ఏం సమాధానం చెప్పలేకపోయాడు.

సెంట్రల్ జైల్లోకి వచ్చిన మొదట్లోనే జైల్లోని ఖైదీలకి వయోజన విద్యా ప్రచారం క్రింద అధ్యాపకుడిగా పనిచేస్తే శిక్షాకాలంలో కొంత తగ్గుతుందని సూపరెన్టెంట్ చెప్పినపుడు-

"చదువుకోవటమన్నా చదువు చెప్పట మన్నా నాకు నచ్చదు! ఐ హేట్ దట్ రెచెడ్ ప్రొఫెషన్ !" అన్నాడు కసిగా.

తరువాత జైలుడాక్టరుకింద హెల్పర్‌గా, జైలర్‌కి డిప్యూటీ జైలర్లకి సహాయకుడుగా, భోజనశాలలో సర్వర్‌గా రకరకాల పనులు చేసి అందరి ఆదరాభిమానాలకి పాత్రుడయ్యాడు.

కాని యిప్పుడు .... ఏ వృత్తి తను అసహ్యించుకున్నాడో. తండ్రి చెప్పిన ఏ హితువు తను చులకనగా చూశాడో, జైలు సూపరెన్టెంట్ చెప్పిన ఏ సలహా తను త్రోసిపుచ్చాడో ఇప్పుడు....అదే వృత్తికి సంబంధించిన పని .... !

"సూర్యంబాబూ! అడిగితే నువ్వు కాదనవని .... నన్ను వురితీసే యీ వారంలోపల, నీకాడ రెండుముక్కలు సదువుకోడమే నా సివరి కోరికన్నా! ఏం బాబూ .... రెండు ముక్కలు సెప్పవా ?" అడిగాడు అతను నిష్పృహతో.

ఆకలిగొన్న పులిలా, పగబట్టిన పాములా, కసిగా, కరుకుగా, కటువుగా లోకంమీద కసితో హంతకునిగా....ఉరి కంబం ఎక్కబోతున్న యీ ఖైదీ... పసివాడిలా, ఆత్మీయతతో, గౌరవభావంతో! భయభక్తులతో వుండేట్టుగా ఏ అతీత శక్తి చేసింది!?

అది - గురుశిష్యుల సంబంధమా ?

ఆ సంబంధానికి యింత మహత్తర శక్తి వుందా ? అక్షరాజ్ఞానంలేని హంతకుడు కూడా తనకు రెండు ముక్కలు నేర్పే వ్యక్తిని ఇంత గౌరవంగా, ఆరాధనా భావంతో చూస్తాడా!?

తను ఆ ఖైదీ చివరికోరిక తప్పక తీర్చాలి! తన అక్షరజ్ఞానం ఆ ఖైదీ చివరికోరిక తీర్చే సాధనం! ఆ ఆలోచన



రాగానే సూర్యంలో ఏదో ఆనందం తొంగిచూసింది.

సూర్యం వెంటనే 'ఓ-న-మః - శి-వా-యః' అంటూ వ్రాసి ఆ ఖైదీ చేయి పట్టి అవి ఉచ్చరిస్తూ దిద్దించాడు.

చివరి మూడక్షరాలు దిద్దుతూనే.... "సూర్యంబాబూ .... నువ్వు రాసిన యీ అచ్చరాల్లో మా అబ్బాయి పేరు యిన బడుద్ది," అన్నాడు. సూర్యం - "శి-వ-యః" అని మళ్ళీ దిద్ది చెప్పగానే - "ఏంది బాబూ .... ఈః మూడచ్చరాల్లో మా శివాయ్ పేరుందా!?" అన్నాడు ఆ ఖైదీ సంతోషం పట్టలేక నమ్మలేనట్లు.

వెంటనే ఆ మూడక్షరాల్ని రెండు

సార్లు చూసి, ఏకసంతాగ్రహిలా రాసేశాడు.

ఏదో మానవాతీత శక్తి అతనికి లభించినట్టు! ఏదో ప్రపంచ వింతను మొదటిసారి తను చూసినట్టు, అతని కళ్ళలో ఏదో వింతకాంతి; అతని ముఖంలో ఏదో అనిర్వచనీయానందం!

అది మాటలకు అందని అనుభూతి.

"మా శివాయ్ పేరు వచ్చేసింది. ఇక అచ్చరాలన్నీ దిద్దబెట్టు బాబూ! ఈ వారంలో అయ్యన్నీ నేను నేర్చుకొని రాసేయాలి!" అన్నాడు పంబరపడి పోతూ.

సూర్యం అలస్యం చెయ్యకుండా అక్షరాలన్నీ నేలమీద వ్రాశాడు.

ఆ ఖైదీ వాటిని చూస్తూనే ఆనంద పరవశుడై పోతూ చొక్కాలోపల దాచు కున్న నాలుగు పోస్టుకార్డులు తీశాడు. వాటిమీద బొగ్గు ముక్కతో అక్షరాలన్నీ చూసి వ్రాసుకున్నాడు.

సూర్యంచేత ఏ అక్షరం ఎలా పలకాలో చెప్పించుకున్నాడు. ఆ కార్డులు మళ్ళీ చొక్కాలో దాచుకున్నాడు.

"ఈ కార్డులు పురితీయడానికి ముందు మావాళ్లెవరైనా వుంటే రాయించుకో మన్నారు!" అన్నాడు ఖైదీ లేచి నిల బడుతూ.

"నీ పేరేమిటి?" అడిగాడు సూర్యం

"నాగయ్య - బాబూ," చెప్పాడు ఖైదీ.

"నీ కెందుకు పురిశిక్ష పడ్డది?"

"మా వూరి మోతుబరి రైతు మంగయ్య ఏందోరాసిన కాగితం తెచ్చి సాచ్చిగా యేలిముద్రేయమంటే ఏశా! తరువాత తెలిసింది అది నేను అదికాడ పదేలు అప్పుతీసుకున్నట్టు దస్తాయేజు కాగితమని! కడుపు మండి ఎల్లడిగితే-


"మర్యాదగా నీ ఎకరం నా పొలంలో కలుకుపుకుంటాను. అమ్మరా అంటే తెగ నీల్గావుగా! ఇప్పుడు నీ దిక్కున్న సోట సెప్పుకో!" అన్నాడు.

అంతే నాచేతి వసిగర్ర దెబ్బకి మంగయ్య తల గుళ్ళో కొబ్బరికాయలా పగిలింది.

నేను జైల్లోపడ్డానని నా పెళ్లాం, నా కొడుకు శివాయ్‌సేత చదువు మానిపించి కూలిపనికి పంపుతుందట! వాడు కూలి నాలి సేసి సంపాదించిన డబ్బుతో నాకు సిచ్చ తగ్గాలని పీడర్ని పెట్టిందట! నేను నాశనమైందిగాక, మా శివాయ్ కూడా ఎందుకు నాశనం కావాలి!? అందుకే సచ్చేముందు ఒక మంచిపని చేసి సావాలని నీ కాడికొచ్చా! రోజూ భోజనాల కాడ కలుసుకున్నప్పుడు యీ కార్డుమీది అచ్చరాలు ఎలా పలకాలో, దిద్దాలో సెబుతావుగా బాబూ! వత్తా!" అంటూ దండంపెడుతూ కాళ్ళచేతుల గొలుసులు గలగల లాడుతుండగా వెళ్ళాడు.

* * *

జైళ్ళ మినిస్టరు తనిఖీకి వస్తున్నారని




తెలియటంతో జైలు అధికారులతోపాటు వాళ్ళకింద పనిచేసే సూర్యంకూడా బిజీ అయిపోయాడు. అయినా భోజనాలశాల దగ్గర రెండుపూటలా నాగయ్యకు అక్షరాలు, గుడింతాలు, కొమ్ములు, పొల్లులు చెబుతూనే వున్నాడు.

ఒకరోజు తెల్లవారుఝామున సూర్యం వున్న జైలు కటకటాలు తెరుస్తున్న చప్పుడు విని, తనతో అంత వుదయమే ఏంపని వచ్చిందో అర్థంకాక విస్మయంతో సూర్యం లేచికూర్చున్నాడు

లోపలికి నాగయ్య వచ్చాడు.

తలంటు పోసి, నుదుట కుంకుమ బొట్టు, వదులుగావున్న ఖద్దరు చొక్కా-పైజమాతో మరో లోకంనుంచి జైలు చూడటానికి వచ్చిన దేవుడులా వున్నాడు.

సూర్యం గుర్తుపట్టి "నాగయ్యా!" అన్నాడు. అతనికి అప్పుడే గుర్తొచ్చింది నాగయ్యను వురితీయటానికి తీసికెళుతున్నారని.

సూర్యం ముఖాన ఆలోచనతో చెమట పట్టింది.

భయంగా విస్మయంగా చూశాడు.

"ఇదిగో బాబూ కార్డు. నేను మా శివాయ్‌కి రాసింది! ఇది తప్పక పంపుతావు కదూ!

"యాఁవుతోంది, యెలతా!" అంటూ చేతులెత్తి సూర్యానికి దండంపెట్టి ముందుకు నడిచాడు.

సూర్యం తన చేతిలోని పోస్టుకార్డు మీద వంకరటింకరగా వున్న అక్షరాలు చదువుతున్నాడు.

"శివాయ - బా.గా సదుకొ - నాగయ"

———